కథ

# పశ్చాత్తాపం

ఆదుర్తి బాల

"ఏయ్ సంధ్యా ఆగు...ఆగమంటుంటే..."

వెనక నుండి మహేష్ పిలుపులు విని పిస్తున్నా విననట్టే వడివడిగా అడుగులు వేసింది సంధ్య. కానీ ఆమె నాలుగు అడుగులు వేసిందో లేదో పరుగులాంటి నడకతో వచ్చి ఆమెను చేరుకున్నాడు మహేష్.

"ఏంటి సంధ్యా పిలిచినా వినిపించనట్టే వెళ్లిపోతున్నావ్. ఐనా నన్ను చూస్తేనే ఏదో దయ్యాన్నో భూతాన్నో చూసినట్టు దడుసుకుంటావేం? ఐయామ్ యువర్ సిన్సియర్ లవర్ యార్" అన్నాడు మహేష్.

అతడి వంక ఓసారి కోపంగా చూసి గబగబా నడవసాగింది సంధ్య. త్వరగా బస్టాపు చేరుకొని ఏదోక బస్సెక్కి అతడిని వదుల్చుకోవాలని ఆమె తాపత్రయం.

"అంత కోపమెందుకు డియర్. అసలీ డ్రెస్‌లో నువ్వెంత బాగున్నావో తెలుసా. అయినా ఏ డ్రెస్సయినా నప్పుతుందిలే నీకు. నీ ఫిగర్ అలాంటిది మరి" వెకిలిగా నవ్వాడు మహేష్.

సంధ్యకి వళ్లంతా తేళ్లూ, జెర్రెలూ పాకినట్టైంది.

"ఇంత మంచి కాంప్లిమెంటిస్తే కనీసం థాంక్సయినా చెప్పవా సంధ్యా?"

"నా అందం గురించి కాంప్లిమెంటివ్వడానికి నువ్వెవరు?" విసురుగా అంది సంధ్య.

"చెప్పాగా నేను నీ ప్రేమ పిచ్చాడినని. నీ అందం నాకు గాక ఇంకెవరికి"?

"పిచ్చి వాగుడు కట్టిపెట్టు. నేన్నిన్ను ప్రేమించట్లేదు. ఇంకెప్పుడూ ప్రేమా దోమా అంటూ నా వెంట పడకు"

"ఎందుకు ప్రేమించవ్.. నువ్వు నన్ను ప్రేమించి తీరాలి" మొండిగా అన్నాడు మహేష్.

"అదే ప్రేమ నీ మీద కూడా నాకు కలగాలిగా. నీది వన్‌సైడ్ లవ్. వెరీ సారీ. నీకు తగ్గ అమ్మాయిని వెతుక్కో" చెప్పాల్సిన నాలుగు ముక్కలూ చెప్పి అపుడే వచ్చిన బస్సెక్కేసింది సంధ్య.

ooo

చదవడానికి పుస్తకాలు ముందేసుకుని కూర్చుంది గానీ కాన్సన్‌ట్రేషన్ కుదరట్లేదు సంధ్యకి. పరీక్షలు దగ్గర కొస్తున్నాయి హాయిగా చదూకుందామంటే ఈ మహేష్ గొడవతో మనసంతా చికాకైపోతోంది. అందమైన ఆడపిల్ల కనిపించగానే స్వీట్‌షాపులో స్వీట్ లాగానో, షోకేస్‌లో బొమ్మలాగానో చూస్తారుగానీ ఆడపిల్లకీ ఓ మనసుంటుందనీ, ఆ మనసుకీ ఇష్టాయిష్టాలుంటాయని ఈ మగవాళ్లెందుకు ఆలోచించరు. అయినా తన పిచ్చి గానీ అలా ఆలోచిస్తే ఇలా ప్రేమించమని ఎందుకు వేధిస్తారు. ప్రేమించమని వెంట పడడం.. కాదంటే కత్తితో నరికెయ్యడం.. యాసిడ్‌తో దాడి చెయ్యడం ఎన్ని చూడట్లేదు? అలాటి ఆలోచన రాగానే ఉలిక్కి పడింది సంధ్య. ఒకవేళ మహేష్ కూడా అలా తెగిస్తాడా తనపైన అనుకోగానే ఉలిక్కి పడింది సంధ్య. ఒక్కసారిగా భయంతో బిగుసుకుపోయింది. సంధ్య ఓ కార్పొరేట్ కాలేజీలో సీనియర్ ఇంటర్ చదూతోంది. ఎంసెట్‌లో మంచి రాంకు తెచ్చుకొని తనకు నచ్చిన బ్రాంచిలో ఇంజినీరింగ్ చేయాలని ఆమె ఆశయం. ఇక మహేష్ విషయానికొస్తే అతడు ఓ ప్రైవేటు కాలేజీలో బి.టెక్ చదూతున్నాడు. భవిష్యత్తు మీద అతడికి నిర్దిష్టమైన ప్రణాళిక లేమీ లేవు. స్టూడెంట్ లైఫంటే జల్సా చేయడమనే అతడి ఉద్దేశ్యం. మహేష్ చెల్లెలు అనిత. ఓ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదూతోంది. మహేష్ తల్లి తండ్రులిద్దరూ జాబ్ హోల్డర్స్. వేలకి వేలు డొనేషన్లు కట్టి మంచి కాలేజీలో చేర్పించి.. పిల్లలకి కావల్సినంత పాకెట్ మనీ ఇస్తే చాలు తమ బాధ్యత తీరిపోయిందనుకునే టైపు తల్లిదండ్రులు వాళ్లు.

ooo

ఆ రోజు కాలేజీ విడిచిపెట్టగానే గేటు దగ్గరే ప్రత్యక్షమయ్యాడు మహేష్. అతడిని చూస్తూనే మొహం చిట్లించింది సంధ్య. ఎందుకొచ్చావ్ అన్నట్టుగా చూసిందతని వైపు. ఆమె భావం అర్థమైనట్టుగా అన్నాడు మహేష్.

"నీ చేత ఎస్ అనిపించేంత వరకూ నేనిలాగే తిరుగుతాను గుర్తుంచుకో. ఒక్కసారి నీ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూడు. ఎందరు ప్రేమజంటలు సినిమా హాళ్లలోనూ, పార్కుల్లోనూ కనిపిస్తారో చూడు. లైఫ్‌ని ఎంజాయ్ చెయ్యడం నేర్చుకో. అయినా నేన్నిన్ను టైంపాస్ కోసం లవ్ చెయ్యట్లేదు. ఐయామ్ ఎ సిన్సియర్ లవర్. నువ్వూ నన్ను ప్రేమించు. పెద్దవాళ్లు ఒప్పుకోకపోతే ఎటైనా పారిపోయి పెళ్లిచేసుకుందాం. ముందర నన్ను ప్రేమించు. ప్లీజ్ లవ్ మి. నీ కోసం ఏం చెయ్యడానికైనా రెడీగా ఉన్నాను" ఉద్వేగంగా అన్నాడు మహేష్.

అతడి ధోరణికి సంధ్య ఇరిటేట్ అయిపోయింది. "ఎన్నిసార్లు చెప్పాలి నీకు. నిన్ను నేను ప్రేమించలేను. నువ్వంటే నాకు అయిష్టం. ఎలర్జీ... పోనీలే అనుకుంటే శృతిమించిపోతున్నావ్. ఇంకోసారి ప్రేమ అంటూ వెంట పడితే పోలీస్ కంప్లయింట్ ఇస్తా జాగర్త" మనసులో భయంగానే ఉన్నా పైకి బింకంగా అన్నది సంధ్య.

ఒక్క క్షణం ఆగి స్థిరంగా అన్నాడు మహేష్. "నీకు రెండు రోజులు టైమిస్తున్నాను. ఈ లోపల నువ్వు నాకు ఐ లవ్ యూ అని చెప్పాలి లేకపోతే నాలో రాక్షసుడిని చూస్తావ్. నాకు దక్కని నిన్ను బతకనివ్వను గుర్తుంచుకో"

నిశ్చేష్టురాలై నిలచిపోయింది సంధ్య.

ooo

తన తల్లీ తండ్రీ ఆఫీసుకెళ్లిపోగానే కంప్యూటర్ ముందు సెటిలైపోయాడు మహేష్. అనిత కూడా కాలేజికి వెళ్లిపోవడంతో అతడికి కావల్సినంత ఏకాంతం దొరికిందతని ఇంట్లో. తనకి కావాల్సిన వెబ్‌సైట్ ఓపెన్ చేశాడు. అతడు కోరుకున్న దృశ్యాలు కంప్యూటర్ తెర మీద ప్రత్యక్షమయ్యేసరికి ఏదో తెలియని ఉద్వేగం ఆవరించింది అతడిని. అప్రయత్నంగా కళ్లు విప్పార్చుకొని చూడసాగాడు. నగ్నంగా ఉన్న స్త్రీపురుషుల శృంగార దృశ్యాలవి. కొద్ది రోజులుగా అతడలాటి దృశ్యాలు చూడడానికి అలవాటు పడ్డాడు. ఎదురుగా కనిపించే దృశ్యాలు అతడిని రెచ్చగొడుతున్నాయ్. ఆ దృశ్యంలోని స్త్రీ పురుషులలో తననీ సంధ్యనీ ఊహించుకుంటున్నాడు. చూసినకొద్దీ పిచ్చిగా అయిపోతోంది మనసు. ఆ సుఖం పొందలేని అసంతృప్తి సంధ్య మీద కోపంగా మారింది. ఇక భరించలేనట్లు కంప్యూటర్ ఆఫ్ చేసి లేచి నుంచున్నాడు.

తను సంధ్యకిచ్చిన డెడ్‌లైన్ ఈ రోజే. ఇవాళ తన దారికి వస్తే సరే లేకపోతే దాని అందమైన మొహం మీద

యాసిడ్ పోసి వికృతంగా చెయ్యాలి. తన అందం చూసుకు నేగా దానికంత పొగరు. కురూపి మొహంతో అది కుళ్లి కుళ్లి ఏడవాలి. తనని కాదన్నందుకు దానికదే తగిన శిక్ష. వికృతంగా నవ్వు కున్న మహేష్‌లో రాక్షసుడు నిద్రలేచాడు. తన గదిలో పుస్తకాల రాక్‌లో వెనగ్గా దాచుకొన్న విస్కీ తెచ్చి గ్లాసులో ఒంపుకున్నాడు. నెమ్మదిగా తాగడం మొదలుపెట్టాడు. కొంత తాగాక సీసా తీస్కెళ్లి యధా స్థానంలో దాచేశాడు. టైం చూసుకున్నాడు. సంధ్య కాలేజ్ బైటకి రావడానికి ఇంకా రెండు గంటలు టైముంది. అంతవరకూ వెయిట్ చెయ్యక తప్పదు అనుకుంటూ అద్దం ముందు నిలబడి చెదిరిన క్రాఫ్‌ని సరిగా దువ్వుకున్నాడు. తన యమహా బండి తాళాలందుకొని జేబులో వేసుకున్నాడు. ఆ రోజు తను తలపెట్టిన కార్యం కోసం ఎప్పుడో రెడీగా ఉంచుకున్న యాసిడ్ బాటిల్ అందుకున్నాడు. జీవితం సంధ్యతో హాయిగా గడపాలనుకున్నాడు. దీని అవసరం రాకూడదనే ఇన్నాళ్లూ ఈ బాటిల్‌ని దాచి ఉంచాడు. కానీ.. బాడ్ లక్ సంధ్యా.. వెరీ బాడ్ .. అనుభవించు... కసిగా అనుకున్నాడు. బయటకెళ్లడానికి ఉద్యుక్తుడవుతూ రెండడుగులు వేశాడు.

అపుడు మోగింది ఫోను..ఆగకుండా మోగుతూనే ఉంది.

ఇప్పుడెవరు ఫోన్ చేస్తారు.. అనుకుంటూనే విసుగ్గా ఫోనందుకుని హలో అన్నాడు.

"హలో.. నేను వందనా జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్‌ని మాట్లాడుతున్నాను. అనిత మీకేమవుతుంది?" అడిగింది అవతలి కంఠం.

"అనితా... అనిత నాకు చెల్లెలు. చెప్పండి ఎందుకు ఫోన్ చేశారు" కొంత నిర్లక్ష్యం విసుగు నిండిన స్వరంతో అన్నాడు మహేష్. తను తలపెట్టిన పనికి ఈ ఫోన్‌కాల్ ఎందుకో అపస్వరంలా తోచిందతనికి.

"కొంచెం సావధానంగా వినండి మిస్టర్... కంగారు పడవద్దు. మీ చెల్లెలు అనిత వందనా కాలేజ్‌లో సీనియర్ ఇంటర్ చదూతోందా..." ఆందోళనగా అంది ప్రిన్సిపాల్.

మహేష్ మనసేదో కీడు శంకించింది.. "ఔను.. ఏమయింది మా చెల్లికి.. ఎనీ ప్రాబ్లమ్?"

అవతల నుంచి ఒక్క క్షణం నిశ్శబ్దం.. తరువాత వినిపించింది.. స్పష్టంగా.


"మీ చెల్లి మీద యాసిడ్ దాడి జరిగింది. జ్యోతి నర్సింగ్‌హోంకి తీసుకెడుతున్నాం. అక్కడికి త్వరగా వచ్చేయండి"



కథానిలయం
శ్రీకాకుళం

ఒక్క క్షణం తనేం విన్నాడో అర్థం కాలేదు మహేష్‌కి. తన చెల్లి మీద యాసిడ్ దాడి జరిగిందా? తను నిజంగానే విన్నాడా.. తాగిన మత్తు దిగిపోయిందతనికి. మనసంతా భయం, నిస్సత్తువ ఆవహించగా కుర్చీలో కూలబడిపోయాడు. ఇలాటి దాడులు సడన్‌గా జరగవు. అంటే.. అంటే.. తన చెల్లినెవరో కొంతకాలంగా వేధిస్తున్నారన్నమాట. తను సంధ్యని వేధించినట్టే... అప్రయత్నంగానే అనుకున్నా.. అలా అనుకున్నందుకు ఉలిక్కిపడ్డాడు. లేచి తల్లితండ్రులకి ఫోన్ చేసి జరిగిందంతా చెప్పాడు. తను నర్సింగ్ హోంకి వస్తున్నానని వాళ్లని కూడా ఆఫీసు నుంచీ అటే రమ్మని చెప్పాడు. ముఖం, మెడ కాలి బొబ్బలెక్కి వికృతంగా ఉంది అనిత. బాధ భరించలేక ఆమె పెట్టే కేకలు

హృదయ విదారకంగా ఉన్నాయి. చెల్లి పడే బాధ చూసి కదిలిపోయాడు మహేష్. రెండు చేతులతో మొహం కప్పుకొని ఏడవసాగాడు. అనిత మంచం పక్కనే కూర్చుని గుండెలవిసేలా ఏడుస్తోంది తల్లి. ఎపుడూ హుందాగా, ఠీవిగా ఉండే తండ్రి మొహంలో ఎన్నడూ చూడని దైన్యం..




డాక్టర్లు ట్రీట్‌మెంట్ మొదలు పెట్టారు. నొప్పి తెలీకుండా ఇంజక్షన్లిస్తున్నారు. మందులేస్తున్నారు. అనిత ఫ్రెండ్సందరూ వచ్చారు. ఆమె కాలేజీ స్టాఫంతా అక్కడే ఉన్నారు.

"ఎవడు.. ఏ రాస్కెల్ చేశాడీ పని? ఆకు చాటు పిందెలా అమ్మా, నాన్నల చాటున పెరుగుతున్న నా బిడ్డ కావల్సొచ్చిందా వాడికి... వాణ్ని చంపినా పాపం లేదు" ఏడుస్తూనే తిడుతోంది మహేష్ తల్లి. ఎవరో అనిత ఫ్రెండట జరిగిందంతా మహేష్ తండ్రితో చెప్తోంది. అతడి పేరు సందీప్.. ఏదో కాలేజీలో చదుతున్నాడట. రోజూ కాలేజి వదిలే టైంకి గేటు దగ్గరే కాచుక్కూర్చుంటాడట. తనని ప్రేమించమని అనిత వెంటపడుతున్నాడట. వాడి గోలతో సరిగా చదుకోలేకపోతున్నానని ఎన్నిసార్లో తనతో చెప్పి బాధ పడిందట.. చెప్పిందా అమ్మాయి.

"మరి మా అనిత మాతో ఎందుకు చెప్పలేదమ్మా" తండ్రి కంఠం వణుకుతోంది.

"ఎన్నిసార్లో చెప్పాలని అనుకుందం కుల్."

"మరి..." ప్రశ్నార్థకంగా చూశాడు మహేష్ తండ్రి.


ఆ అమ్మాయి కాసేపు తటపటాయించి చెప్పింది.. "మీ దగ్గర తనకంత చనువు లేదట. అదీగాక అమ్మా, నాన్నలకి ఆఫీసులోనే బోల్డన్ని టెన్షన్లు. ఇంటికి వచ్చినా వాళ్లు మాతో గడిపే సమయం తక్కువ. అలాటప్పుడు ఈ విషయాలు ఎలా చెప్పను అన్న దంకుల్"

జరిగిందానికి పరోక్షంగా తాము కూడా కారణమే అనిపించింది మహేష్ తండ్రికి. పిల్లలతో తాము గడిపింది తక్కువే.. ఒకవేళ వాళ్లతో మాట్లాడినా చదువూ.. రాంకుల గురించేగానీ వారికీ ఇతర సమస్యలుంటాయనీ వాటి గురించి తెలుసుకోవాలని తమకేనాడూ అనిపించలేదు.

బాధగా తలపట్టుకున్నాడు మహేష్ తండ్రి.

"ఆడపిల్లంటే అంగట్లో బొమ్మలనుకుంటున్నారు వెధవలు.. ఆడపిల్లని ఏడిపిస్తే ఆ ఉసురు ఊరికే పోతుందా? వాడికీ ఓ చెల్లెలుంటే ఆ పిల్లకీ ఈ పరిస్థితి వస్తేగానీ అర్థంకాదు వెధవలకి" ఎవరో అంటున్నారు.

ఛళ్లున చరచినట్లైంది మహేష్‌కి.. సంధ్య పట్ల తనెంత దారుణంగా ప్రవర్తించాడు? ఎంత వేధించి ఏడిపించాడు. నిజంగా ఆ ఉసురు తగిలే తన చెల్లికీ పరిస్థితి వచ్చిందా..?



"ఏం చేస్తామండీ లోకం అలా మారిపోయింది. ఇంటింటా టీవీలు చూడకూడని ఛానల్స్.. ఇక కంప్యూటర్లు ఇంటర్నెట్లూ.. రకరకాల వెబ్‌సైట్లు.. పిల్లలు చెడిపోడానికి వంద కారణాలు..."

ఎవరే కామెంట్ చేసినా అది తనని ఉద్దేశించినట్టే అనిపిస్తోంది మహేష్‌కి. అందరి నుంచి దూరంగా నడిచాడు. అప్పటి వరకు జేబులో దాచిన యాసిడ్ బాటిల్ తీసి డస్ట్‌బిన్‌లో పడేశాడు. మౌనంగా కళ్లు మూసుకుని దేవుడిని ప్రార్థించాడు... 'తప్పు ఏదైనా చేస్తే నన్ను శిక్షించు. అభం శుభం తెలియని నా చెల్లిని త్వరగా కోలుకునేటట్టు చెయ్యి.. ఇంతకు మించి నిన్నేమీ కోరను స్వామీ' పశ్చాత్తాపం కన్నీరై అతడి పాపాన్ని ప్రక్షాళన చేస్తోంది.

○

## ఇదో గొడవ!

మాళవిక ప్రస్తుతం తమిళంలో బిజీ నటి. అయితే తాజాగా ఆమెను 'కార్తిగై' అనే సినిమా నుంచి తొలగిస్తున్నట్టు నిర్మాత, దర్శకులు చెప్పడంతో దుమారం బయల్దేరింది. తమకిచ్చిన కాల్షీట్లను తమ షూటింగ్ కోసం వినియోగించనివ్వకుండా సినిమా నిర్మాణానికి ఆటంకం కలిగించిందనేది నిర్మాతల ఆరోపణ. సినిమా పూర్తి కావడంలో ఆలస్యం జరక్కూడదని మాళవికను తొలగించి మరో నటి ఎంపికలో బిజీగా వున్నారు నిర్మాతలు. దీంతో వాళ్లమీద కేసు వేస్తోందిట మాళవిక. తనతో నిర్మాత అసభ్యంగా ప్రవర్తించాడనేది ఆ కేసు సారాంశం. తమిళ సినీ తారల 'నడిగర్ సంఘం' నేతలు ఈ సమస్యని సామరస్యంగా పరిష్కరించడానికి కుస్తీపడుతున్నారట.